టీ హబ్‌లో 14న ఇండో-ఫ్రెంచ్ హెల్త్ అండ్ లైఫ్ సైన్సెస్ సదస్సు

సిటీబ్యూరో, నవంబర్ 8(నమస్తే తెలంగాణ): ఇండో-ఫ్రెంచ్ హెల్త్ అండ్ లైఫ్ సైన్సెస్ సదస్సును టీ హబ్ ఆధ్వర్యంలో ఈ నెల 14న నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. వైద్య, ఆరోగ్య రంగాల్లో వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఇండస్ట్రీ నిపుణులతో ఈ సదస్సులో చర్చలు ఉంటాయని తెలిపారు. ఔత్సాహిక స్టార్టప్ వ్యవస్థాపకులు వైద్య, ఆరోగ్య రంగంలో ఉన్న సమస్యలు, వాటిని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించేందుకు అవసరమైన వనరులను పరిశ్రమలు అందించేలా టీ హబ్ సహకరిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఈ కింది లింకులో (forms.office.com /r/r9NdthBQ94) సంప్రదించాలని తెలిపారు.

15వ తేదీ నుంచి 17 వరకు లీగల్ ఎగ్జిబిషన్

హైదరాబాద్, నవంబర్ 8(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో తొలి సారిగా లీగల్ ఎగ్జిబిషన్ జరగనుంది. హైదరాబాద్‌లోని కేశవ మెమోరియల్ లా కాలేజీ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు మూడు రోజుల పాటు లీగల్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి అక్కపెద్ది శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లీగల్ ఎగ్జిబిషన్‌కు ముఖ్య అతిథిగా జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి హాజరై ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఈ మూడు రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు లీగల్ ఎగ్జిబిషన్ కొనసాగనుంది. లీగల్ వ్యవహారాలతో పాటు కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత చట్టాలపై అవగాహన కలిగించేలా పలు స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని న్యాయ కళాశాలల విద్యార్థులతో పాటు లీగల్ వ్యవహారాలు తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరు లీగల్ ఎగ్జిబిషన్‌కు హాజరు కావొచ్చని ప్రిన్సిపాల్ వాణి తెలిపారు.

నేడు వర్కింగ్ డేనే..

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సిటీబ్యూరో, నవంబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో నేటి రెండో శనివారాన్ని పనిదినంగా ప్రకటిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 17న గణేష్ నిమజ్జనం సందర్భంగా సెలవు ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా నేటి రెండో శనివారాన్ని వర్కింగ్ డేగా పరిగణించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

టామ్‌కామ్ ఆధ్వర్యంలో మోటార్ రంగంలో ఉద్యోగావకాశాలు

సిటీబ్యూరో, నవంబర్ 8(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో అర్హత కలిగిన వారికి ఉద్యోగావకాశాలు అందించడం కోసం దరఖాస్తులు స్వీకరణ జరుగుతుంది. కాగా, జర్మనీలో ఆటోమోటివ్ టెక్నిషియన్ల ఎంపిక ప్రక్రియకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మెర్సిడెజ్, స్కోడా, హ్యుండాయ్, నిస్సాన్, ఓపెల్, ఫోర్డ్, వోల్వో, వోక్స్ వ్యాగన్, ఫియట్ తదితర ప్రముఖ ఆటో మోటివ్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందొచ్చని తెలిపారు. అభ్యర్థులు కమర్షియల్ వాహన మెకాట్రానిక్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ లేదా సంబంధిత రంగంలో మూడేండ్ల అనుభవంతో కూడిన డిప్లమా కలిగి ఉండాలని తెలిపారు. వయో పరిమితి 20-40 ఏండ్ల లోపు ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు టామ్‌కామ్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. మరింత సమాచారం కోసం ఫోన్ నం. 94400 52592 / 94400 49013 లలో సంప్రదించొచ్చని పేర్కొన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారుల హెరిటేజ్ వాక్

సిటీబ్యూరో, నవంబర్ 8(నమస్తే తెలంగాణ): వరల్డ్ టౌన్ ప్లానింగ్ డేను పురస్కరించుకొని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా హెరిటేజ్ వాక్‌ను నిర్వహించారు. నగరంలోని మూసీ రివర్ హెరిటేజ్ జోన్‌తో పాటు ఇతర ప్రాంతాలను టౌన్ ప్లానింగ్ అధికారుల బృందం శుక్రవారం సందర్శించారు. ఐటీపీఐ-తెలంగాణ రీజినల్ చాప్టర్ సభ్యులతో పాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలో పనిచేస్తున్న అధికారులు డీటీసీపీ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, హెచ్ఎండీఏ డైరెక్టర్ విద్యాధర్, జీహెచ్ఎంసీ సీసీపీ కె.శ్రీనివాస్, అడిషనల్ సీసీపీలు గంగాధర్, ప్రదీప్‌లు హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐటీపీఐ-తెలంగాణ రీజినల్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ వసంత శోభ తురగ మాట్లాడుతూ, ప్రతియేటా నవంబర్ 8న ప్రపంచ వ్యాప్తంగా వరల్డ్ టౌన్ ప్లానింగ్ డేను నిర్వహిస్తామని, అందులో భాగంగా రకరకాల కార్యక్రమాలను నిర్వహిస్తుంటామని, ఈ సారి నగరంలోని చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శించి వాటి వివరాలను తెలుసుకున్నామని తెలిపారు.

నూతన వధూవరులకు కేటీఆర్ ఆశీర్వాదం

బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ కుమార్తె అనూరాధ - గౌతమ్‌ల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, పక్కన ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంఎన్ శ్రీనివాస రావు, ముఠా జయసింహ తదితరులు – ముషీరాబాద్, నవంబర్ 8;

బెంగళూరులో చెరువులపై హైడ్రా అధ్యయనం

రెండో రోజు పర్యటనలో
చెరువుల అభివృద్ధిపై ఫోకస్

సిటీబ్యూరో, నవంబర్ 8(నమస్తే తెలంగాణ): చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణపై అధ్యయనంలో భాగంగా రెండు రోజుల పాటు బెంగళూరు స్టడీటూర్‌కు వెళ్లిన హైడ్రా బృందం అక్కడి చెరువులను పరిశీలించింది. రెండో రోజైన శుక్రవారం బెంగళూరులో హైడ్రా కమిషనర్ రంగనాథ్ బృందం మొదట లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్‌తో సమావేశమయ్యారు. ఆనంద్ మల్లిగవాడ్ ఆధ్వర్యంలో దొడ్డ తోగూరు చెరువును పునరుద్ధరించిన తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాలుగైదు దశల్లో ప్రకృతి సిద్ధంగా మురుగునీరును శుద్ధిచేసి మైన్ చెరువులోకి పంపిస్తున్న విధానాన్ని రంగనాథ్ తదితరులకు ఆనంద్ చూపించారు. సహజ వనరులతో మురుగు నీటిని శుద్ధి చేసిన విధానం, చెరువుల సుందరీకరణ తదితర అంశాలపై హైడ్రా బృందానికి ఆనంద్ వివరించారు. తక్కువ ఖర్చుతో సహజ వనరులతో చెరువులను శుద్ధి చేయొచ్చని, ప్రజల భాగస్వామ్యంతో చెరువుల పునరుద్ధరణ చేపట్టామని తమ పరిధిలో చెరువులను సుందరీకరణ చేపట్టేందుకు చేస్తున్న కృషిని ఆనంద్ మల్లిగవాడ్ హైడ్రా బృందానికి తెలిపారు. ఆ తర్వాత రంగనాథ్ బృందం కర్ణాటక ట్యాంక్ కన్జర్వేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులతో సమావేశమయ్యారు. కేటీసీడీఏ యాక్ట్ 2014ను గురించి హైడ్రాబృందం అడిగిన సందేహాలకు కర్ణాటక అధికారులు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా కేటీసీడీఏ సీఈవో రాఘవన్, డైరెక్టర్ పవిత్రలను కమిషనర్ రంగనాథ్ బెంగళూరులో చెరువుల పరిరక్షణకు చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో రాఘవన్ మాట్లాడుతూ కర్ణాటకలో ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్ న్‌లో ఉన్న భూమి మొత్తం ప్రభుత్వ భూమిగా పరిగణిస్తామని, బఫర్ జోన్‌ను మ్యాగ్జిమమ్ వాటర్ లెవల్‌గా వివరిస్తూ చెరువు ఆక్రమణల తొలగింపులో అథారిటీ అనుసరిస్తున్న విధానాలను గురించి చెప్పారు. చెరువుల అభివృద్ధిలో డీపీఆర్ రూపొందించడం, దానిని టెక్నికల్ టీమ్ అధ్యయనం చేయడం, తర్వాత పనులను దశల వారీగా ఎలా చేపడ్తారో? హైడ్రా బృందానికి తెలిపారు. కర్ణాటకలో దిశాంక్ యాప్‌లో ప్రభుత్వ భూమి, పట్టా భూమి, భూమి యజమాని ఎవరు? అనేది వేర్వేరుగా సవివరంగా ఉంటుందని తెలియజేశారు. అనంతరం, విమోస్ టెక్నోక్రాట్స్ లిమిటెడ్ సంస్థ చెరువులను పునరుద్ధరించే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హైడ్రా బృందానికి వివరించారు. ఒక చెరువుకు సంబంధించి డీపీఆర్ నుంచి చెరువును సుందరీకరించే వరకు సంస్థ పనితీరును రంగనాథ్‌కు విమోస్ డైరెక్టర్ యూనస్ తెలిపారు.

దొడ్డ తోగూరు చెరువును పునరుద్ధరించిన తీరును హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వివరిస్తున్న లేక్‌మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్

ప్రభుత్వ స్థలాలపై రెవెన్యూ దృష్టి..!

- నిరుపయోగంగా ఉన్న భూముల వివరాలు ఇవ్వాలంటూ కలెక్టర్ ఆదేశాలు
- డిప్యూటీ కలెక్టర్ల పర్యవేక్షణలో మండలాల వారీగా భూములపై ఆరా

సిటీబ్యూరో, నవంబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. మండలాల వారీగా సర్కార్ భూముల లెక్కలు తీస్తున్నారు. ఇందుకోసం డిప్యూటీ కలెక్టర్లను రంగంలోకి దించారు. జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లు, 16 మండలాలు ఉన్నాయి. గతంలో ప్రభుత్వం, సంస్థలకు, వ్యక్తులకు కేటాయించిన భూముల వివరాలను సైతం ఆరా తీస్తున్నారు. ఆ భూములు ఏ కోణంలో ఇచ్చినవి. వాటి ప్రస్తుత పరిస్థితి ఏంటి? నిరుపయోగంగా ఉన్నాయా? కారణాలేంటి? తదితర వివరాలు సేకరించడంతో పాటు నిరుపయోగంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను కూల్చేసి రెవెన్యూ అధికారులు హైదాబాద్ ల్యాండ్ బ్యాంక్‌లో జమ చేస్తున్నారు. ఇటీవల షేక్‌పేట మండలంలో రూ.70 కోట్ల విలువైన భూమి 20 గుంటలను ల్యాండ్ బ్యాంక్‌లో జమ చేశారు. మారేడుపల్లిలో 3 కోట్ల ప్రభుత్వ భూమి అధికారులు ల్యాండ్ బ్యాంక్‌లో జమ చేశారు. వీటితో పాటు కొన్ని విలువైన భూములు కోర్టు కేసుల్లో ఉన్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా లా ఆఫీసర్ ఆధ్వర్యంలో కేసులపై ఎప్పటికప్పుడు వాదనలు వినిపించడం, ఆధారాలతో ఆ భూములను తిరిగి సర్కార్ ల్యాండ్ బ్యాంక్‌లో జమ చేయడంపై అధికారులు దృష్టి సారించారు. కాగా, బంజారాహిల్స్‌లో సుమారు 47 సర్కారీ భూములపై కేసులు నడుస్తున్నాయని ఓ అధికారి తెలిపారు. ఇవన్నీ కోర్టులో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని సాధ్యమైనంత తొందరగా వాటిని ల్యాండ్ బ్యాంక్‌లో జమ చేస్తామని ఓ అధికారి తెలిపారు. మండలాల వారీగా భూ లెక్కలపై త్వరగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సైతం అధికారులను ఆదేశించారు. దీంతో మండల తహసీల్దార్లు తమతమ పరిధిలోని ప్రభుత్వ భూములపై వివరాలు సేకరిస్తున్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

ఓటరు జాబితాకు పార్టీలు సహకరించాలి

రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్

సమావేశంలో మాట్లాడుతున్న ఓటరు జాబితా పరిశీలకులు, రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం, చిత్రంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

సిటీబ్యూరో, నవంబరు 8(నమస్తే తెలంగాణ): తప్పులేని ఓటరు జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని, హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల ఓటరు జాబితా పరిశీలకులు, రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలలో తప్పులు లేని ఓటరు జాబితా తయారీపై పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో రోల్ అబ్జర్వర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అహ్మద్ నదీమ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ప్రధాన భూమిక పోషిస్తుందని, ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం ప్రత్యేక ముసాయిదా ఓటరు జాబితా అని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విడుదల చేశారన్నారు. ఈ జాబితాలో తప్పుల సవరణకు అవకాశం కల్పించారని చెప్పారు. ఈ నెల 9, 10వ తేదీలలో ప్రత్యేక క్యాంపెయిన్ ఉందని, డిసెంబర్ 24వ తేదీన క్లెయిమ్ అండ్ అబ్జెక్షన్ పరిష్కారం చేస్తారని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన ఓటరు జాబితాపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జనవరి 1న ఫైనల్ పబ్లికేషన్ చేస్తారని వివరించారు. తుది ఓటరు జాబితాను వచ్చే జనవరి 6వ తేదీన విడుదల చేస్తారని పేర్కొన్నారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు కాంగ్రెస్ పార్టీ తరపున నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎంఐఎంఐ పార్టీ తరుపున చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫికర్ అలీ, బీజేపీ తరపున మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, అజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ తరుపున పి.రాజేశ్ కుమార్, బహుజన పార్టీ తరపున కేనంద కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ తరపున మొహ్మద్ సొహైల్, సీపీఎం తరపున ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తే సహించేది లేదు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 8: కుల గణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తే సహించేది లేదని, బీసీ కుల గణనతో పాటు ఎస్సీ వర్గీకరణ కూడా పకడ్బందీగా చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాదారం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లిలోని తన నివాసం వద్ద జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కానీ, సర్వేపై ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వకుండా, అసెంబ్లీలో చర్చించకుండా, సొంత నిర్ణయంతో సర్వే చేయడం సరైన పద్ధతి కాదన్నారు. నియోజకవర్గంలో చేస్తున్న కుల గణనపై ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం ఇయ్యలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. సర్వేలో అడిగే ప్రశ్నలకు సంబంధించి ప్రజలకు పలు అనుమానాలు ఉన్నాయని, వాటిపై అవగాహన కల్పించి నివృత్తి చేయాలన్నారు. బీసీ కుల గణన పేరుతో చేస్తున్న సర్వేలో కుటుంబాలకు చెందిన ఆస్తులు, బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఇంట్లోని వస్తువుల వివరాలు ఎందుకు సేకరిస్తున్నారని ప్రశ్నించారు. ఇంటింటి సర్వేలో 75 ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కోరుతుండటంతో, పూర్తి వివరాలు చెబితే ఏమవుతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రభుత్వం చేస్తున్న సర్వేతో బీసీలకు అన్యాయం జరిగితే, వారికి అండగా నిలబడి బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. అనంతరం, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ రంగారావు, కూకట్‌పల్లి సర్కిల్ ఉప కమిషనర్ హరికృష్ణయ్యలు, సిబ్బంది ఉన్నారు.



కూకట్‌పల్లిలోని తన నివాసం వద్ద సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ప్రక్కన డీసీ హరికృష్ణయ్య

బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్స్, అసోసియేషన్ ఆఫ్ మెడికల్ ఫిజిసిస్ట్స్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో 'యాంపికాన్ -2024' పేరుతో నిర్వహిస్తున్న 45వ జాతీయ సదస్సు శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నం.10లోని సేవాలాల్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా సావనీర్‌ను బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ, ప్రొ. బీఎస్ మూర్తి తదితరులు ఆవిష్కరించారు.

బ్రాహ్మణులు వివరాలు నమోదు చేసుకోవాలి

ఆర్కేపురం, నవంబర్ 8 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుం బ సర్వేలో బ్రాహ్మణులందరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఆర్కేపురం డివిజన్‌లో నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్ మా ట్లాడారు. ఉప శాఖలకు అతీతంగా బ్రా హ్మణుల సంఖ్యా బలం నిరూపించుకునే అవకాశం ఆసన్నమైందన్నారు. అన్ని రంగాలలో బ్రాహ్మణులకు గుర్తింపు తెచ్చుకోవడానికి ఈ కులగణన కార్యక్రమంలో ఉప శాఖల ప్రస్తావన కాకుండా కేవలం బ్రాహ్మణ కులంగా మాత్రమే నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి భాస్కర మూర్తి, కోశాధికారి రఘునందన్ పాల్గొన్నారు.

సమావేశంలో మునిపల్లె శ్రీనివాస్ తదితరులు

మైసమ్మ త్రిశూలం ధ్వంసం: దుండగుడికి దేహశుద్ధి

శంషాబాద్ నవంబర్ 8: ఎయిర్ పోర్టు కాలనీలో ఆలయ ధ్వంసం మరవక ముందే శుక్రవారం శంషాబాద్ పట్టణంలోని జాతీయ రహదారి పక్కనున్న కట్ట మైసమ్మ ఆలయం ఎదుట త్రిశూలం ధ్వంసం చేశాడు. సదరు వ్యక్తిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, సదరు వ్యక్తి కావాలనే ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం ధ్వంసం చేశాడని, అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులకు అప్పగించినట్లు వివరించారు. అతడిపై కేసు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితుడు

బతికున్నంత కాలం.. అన్నదానం చేస్తా..

టీఎన్జీవో నేత ముజీబ్ హుస్సేనీ

ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానలో పేద రోగి సహాయకులకు అన్నదానం చేస్తున్న శ్రీనివాసులు, మారం జగదీశ్వర్, ముజీబ్ హుస్సేనీ

సుల్తాన్ బజార్, నవంబర్ 8: పేద రోగి సహాయకులకు ఒక్క పూట కడుపునిండా ఆహారం అందించాలనే సంకల్పంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన డైరెక్టర్ శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానాలో సుమారు 1000 మంది పేద రోగి సహాయకులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం, వారు మాట్లాడుతూ దవాఖానకు వస్తున్న పేద రోగులకు, వారి సహాయకులకు నెలలో నాలుగు సార్లు ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ తాను బతికినంత కాలం పేద రోగి సహాయకులకు ఒకపూట అన్నదానం చేస్తూనే ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్ విక్రమ్ కుమార్, రాజ్ కుమార్, శ్రీనివాస్, ఖాలేద్, వైదిక్ శస్త్ర, ఖురేషి, శ్రీధర్, దవాఖాన సిబ్బంది శివకుమార్, చంద్రశేఖర్, పీఆర్‌వో వహీద్, ముస్తఫా, ఉస్మాన్ అలీ ఉస్మానీ, రామక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ విజిట్‌కు మెథడిస్ట్ విద్యార్థులు

మెథడిస్ట్ ఇంజనీరింగ్ కళాశాల బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నుంచి ఇండస్ట్రియల్ విజిట్‌లో ఎంబీఏ విద్యార్థులు

అబిడ్స్, నవంబర్ 8: మెథడిస్ట్ ఇంజనీరింగ్ కళాశాల బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నుంచి ఎంబీఏ విద్యార్థులు పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్‌లో ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల కరెస్పాండెంట్ కె కృష్ణారావు నేతృత్వంలో హెచ్ఓడీ డాక్టర్ ఎస్.సుజాత ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమానికి తరలి వెళ్లారు. విద్యార్థులకు అధ్యాపకులు పవర్ లూమ్స్, హ్యాండ్లూమ్స్ పరిశ్రమల గురించి విద్యార్థులకు వివరించారు. మెథడిస్ట్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి విద్యార్థులను అధ్యాపకులు కళాశాల బస్సులలో పోచంపల్లికి తీసుకు వెళ్లి అక్కడ పరిశ్రమల గురించి ప్రజలకు వివరించారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ ఎస్.సుజాత విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

హెచ్‌సీయూలో గ్లోబల్ ఎన్‌క్రిప్షన్ డే-24



సదస్సులో ప్రసంగిస్తున్న వీసీ ప్రొఫెసర్ బీజే రావు

కొండాపూర్, నవంబర్ 8: గోప్యతా అవసరాలను దృష్టిలో పెట్టుకుని గణిత శాస్త్రజ్ఞులు, భద్రతా నిపుణులు ఎన్‌క్రిప్షన్ (గుప్తీకరణ), క్రిప్టోగ్రఫీ (గూఢ లిపి శాస్త్రం), క్వాంటం కమ్యూనికేషన్ల ద్వారా వివిధ భద్రతా అవసరాలను పరిశీలించాలని, రాబోయే 20 - 30 సంవత్సరాలకు సిద్ధంగా ఉండాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు అన్నారు. యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ (ఎస్‌సీఐఎస్), ఇంటర్నెట్ సొసైటీ (ఐఎస్ఓసీ), హైదరాబాద్ చాప్టర్ సహకారంతో గ్లోబల్ ఎన్‌క్రిప్షన్ డే - 2024 సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఎస్‌సీఐఎస్ డీన్ ప్రొఫెసర్ అతుల్ నేగి అధ్యక్షతన నిర్వహించిన ఒక రోజు సదస్సుకు వీసీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గోప్యతా అవసరాల దృష్ట్యా గణిత, భద్రతా నిపుణులు ఎన్‌క్రిప్షన్, క్రిప్టోగ్రఫీ, క్వాంటం కమ్యూనికేషనల్ ద్వారా కఠినమైన భద్రతా వలయాలను సృష్టించాలన్నారు. రాబోయే 20 నుంచి 30 సంవత్సరాలకు ముందుగానే అప్రమత్తంగా ఉండేలా భద్రతను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎన్.రుక్మ రేఖ, ఐఎస్ఓసీ ప్రెసిడెంట్ కే మోహన్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాలెడ్జ్ సిటీలో ఇండియన్ వెయిన్ కాంగ్రెస్ -2024

సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

కొండాపూర్, నవంబర్ 8: దేశంలో 25 శాతం మంది వెరికోస్ వెయిన్స్ (సిరలు) సమస్యతో బాధపడుతున్నారని ప్రముఖ వాస్క్యులర్ ఇంటర్ నేషనల్ నిపుణుడు డాక్టర్ రాజా వీ కొప్పాల అన్నారు. నాలెడ్జ్ సిటీలోని డిస్ట్రిక్ట్ 150 కాన్ఫరెన్స్ హాల్‌లో అవిస్ దవాఖాన ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఇండియన్ వెయిన్ కాంగ్రెస్ - 2024కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలోని 25 శాతం మంది వెరికోస్ వెయిన్స్ సమస్యతో బాధపడుతున్నారని, వారిలో చాలా మందికి శస్త్ర చికిత్సలు అవసరం లేకుండానే నయం చేసే అత్యాధునిక చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వెరికోస్ వెయిన్స్ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సులో దేశ, విదేశాలకు చెందిన 100 మంది నిపుణులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగుల ఆందోళన



అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆందోళనలో పాల్గొన్న ఉద్యోగులు

బంజారాహిల్స్, నవంబర్ 8: జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనపై నిరసిస్తూ అంబేద్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. యూనివర్సిటీకి చెందిన అధ్యాపక, అధ్యాపకేతర, ఉద్యోగ సంఘాల నేతలు మధ్యాహ్న భోజన విరామ సమయంలో శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ చైర్ పర్సన్ ప్రొ. పల్లవీ కాబ్డే, కన్వీనర్ ప్రొ. వడ్డాణం శ్రీనివాస్, నేతలు డా. ఎల్‌వీకే రెడ్డి, డా. బి.శ్రీనివాస్, ఎన్‌సీ వేణుగోపాల్, డా. జి.అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.